# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- పర్యావరణ సహిత రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయడంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ఆంధ్రప్రదేశ్ ను వచ్చే సంవత్సరం జూన్ 5 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు.
- హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాల ద్వారా దేశ పౌరులందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు.
- వాయువ్య బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం తెలిపింది.

=========================

పర్యావరణ సహిత రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. ఈ రోజు గుంటూరులో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో `ఏపీ క్లైమేట్ యాక్షన్ ప్లాన్`ను గవర్నర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ సవరణ చట్టం 2021 ప్రకారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపై రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రతీ మూడో శనివారం గ్రామాలు, పట్టణాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని గవర్నర్ సూచిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

=========================

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న ప్రారంభించనున్న “స్త్రీ శక్తి” పథకం అమలు చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే ‘స్త్రీ శక్తి’ పథకం సన్నద్ధతపై ఈరోజు సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగ ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అధిక రద్దీకి అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్థంగా చేయాలని, అందుకు తగ్గట్టు సామర్థ్యం పెంచుకోవాలని, భద్రత కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రయాణికుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సంబంధించి ప్రయాణికుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుని, దానికి అనుగుణంగా పథకాన్ని మరింత మెరుగ్గా అమలు పరచాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ‘ఈ పోస్ మిషన్లకు జీపీఎస్ ను తప్పని సరిగా అనుసంధానం చేసి ట్రాక్ చేయడం ద్వారా ప్రయాణికులకు సరైన సమాచారాన్ని అందించాలన్నారు. సమస్యలు ఎక్కడైనా ఉత్పన్నమైతే వాటిని వెంటనే పరిష్కరించేలా వ్యవస్థ సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ను వచ్చే సంవత్సరం జూన్ 5 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ఈరోజు రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒక సారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ కు స్వస్తి పలుకుదాం.. అనే నినాదంతో ఈనెల 15వ తేదీ నుండి రాష్ట్ర సచివాలయంలో "సింగిల్ యూజ్ ప్లాస్టిక్`ను నిషేధిస్తున్నామని తెలిపారు. విరివిగా ప్లాస్టిక్ ను వినియోగించడం వలన పర్యావరణానికి ఎంతో నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందన్నారు.

==========================

రాష్ట్రంలో వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించిన అనంతరం ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. గత ఏడాది కాలంలో వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చామన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో 80 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునాతన పరికరాలు, వైద్య సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ హెచ్చరించారు.

విరామం

==========================

భావితరాల్లో భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. దేశం కోసం అహర్నిశలూ శ్రమించి, స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామన్నారు. ఈరోజు విశాఖలోని బీచ్ రోడ్డులో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంచి నడవడిక, సాటి పౌరుల పట్ల సోదరభావం, గౌరవం కలిగి ఉండటం ద్వారా స్వాతంత్ర్య స్ఫూర్తిని కాపాడవచ్చన్నారు. రాజ్యాంగం మనకి ప్రాథమిక హక్కులతో పాటు కల్పించిన ప్రాథమిక విధులను ధర్మబద్ధంగా నిర్వర్తించగలిగితే దేశానికి గొప్ప పౌరులుగా నిలుస్తామన్నారు. హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాల ద్వారా దేశ పౌరులందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

"భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉర్దూ భాష పాత్ర" అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నామని మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏపీ ఉర్దూ అకాడమీ నేతృత్వంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, విద్యా శాఖల సంయుక్త నిర్వహణలో ఈ పోటీలను 13, 14వ తేదీలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

==========================

ఉద్యాన పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పశ్చిమగోదావరి జిల్లాలోని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నాలుగు సంస్థలతో ఒప్పందం చేసుకుందని ఉపకులపతి డాక్టర్ కె. గోపాల్ తెలిపారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఉద్యానవన సాగు, మొక్కల ఆరోగ్యం, పంటకోత తర్వాత సాంకేతికత బలోపేతం, డ్రోన్లు, జీపీఎస్ ఆధారిత పద్ధతులు, ఇమేజ్ ప్రాసెసింగ్, నానో-టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలపై ఈ ఒప్పందాలు దృష్టి సారిస్తాయన్నారు. అలాగే శాస్త్రీయ పురోగతి, భాగస్వామ్యాలపై దృష్టి సారిస్తూ... సహకార పరిశోధన, ప్రాజెక్టులు, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు (సీఎస్సార్ ఫండ్స్) సంస్థాగత మద్దతు వంటి విభిన్న అంశాలపైన ఇవి పని చేస్తాయన్నారు.

==========================

ఏజెన్సీ ప్రాంతాలలో నిరుపేద కుటుంబాలను పి 4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఈరోజు రంపచోడవరంలో సచివాలయాల సిబ్బందితో పి 4 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీలో చాలామంది నిరుపేదలు ఉన్నారని వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పి 4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

==========================

ర్యాగింగ్ కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని తూర్పుగోదావరి జిల్లా న్యాయస్థానం ప్రిన్సిపాల్, జిల్లా సెషన్స్ జడ్జ్ గంధం సునీత తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యాంటీ ర్యాగింగ్ వీక్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గంధం సునీత మాట్లాడుతూ, విద్యార్థులకు చట్టలపై అవగాహన కల్పించడానికి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యాలయాలలో ఆనందకరమైన వాతావరణం ఉండాలని, దానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,604 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై... చివరకు అమ్మకాల ఒత్తిడితో 368 పాయింట్ల నష్టంతో 80,235 వద్ద ముగిసింది. నిఫ్టీ 97 పాయింట్ల నష్టంతో 24,487 పాయింట్ల వద్ద స్థిరపడింది.

==========================

వాయువ్య బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఇది రాగల 48 గంటల్లో మరింత బలపడుతుందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

=========================